క్లుప్తంగా

యోగా సాధనతో ఆరోగ్యం



పిరమిడ్‌లో ధ్యానం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ప్రస్తుత యాంత్రిక జీవితంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణకు, ఏకాగ్రతకు యోగా సాధన ఎంతో అవసరమని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. స్థానిక శ్రీనివాస ఎవెన్యూస్ ఆవరణలో నూతనంగా నిర్మించిన షిరిడీ సాయిబాబా ధ్యాన మందిరం, పిరమిడ్‌లను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పిరమిడ్‌లో కొద్దిసేపు యోగా సాధన చేశారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ డైరెక్టర్ గండి నానిబాబు, పిరమిడ్ నిర్వాహకులు, యోగా సాధకులు సంగిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీసులకు యూనిఫాం అందజేత



బిక్కవోలు పోలీసులకు యూనిఫాం అందజేస్తున్న దాత వెంకటరెడ్డి

బిక్కవోలు: స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద జి.మామిడాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్వారంపూడి వెంకటరెడ్డి మంగళవారం 29 మంది పోలీసులకు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ ఆయనను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

మధురపూడి: యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రాఘవపురంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని ఎక్స్‌పర్ట్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు రవికుమార్, సిబ్బంది సుమారు 150 మందికి వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలకు సత్కారం జరిగింది. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చిర్రా ప్రసాద్, కార్యదర్శి పి.జోయల్ రాజు, ముఖ్య సలహాదారుడు ప్రసన్నకుమార్, పెద్దలు కోడి అబ్రహం, పీపీ రత్నం పాల్గొన్నారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

రంగంపేట: మండల పరిధిలోని దొంతమూరులో మంగళవారం ఉపాధిహామీ పథకం సిబ్బంది ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాలతో కూడిన శిలాఫలకాన్ని సర్పంచ్ గోలి రమణ ఆవిష్కరించారు. అనంతరం స్థానిక చెరువు గట్టుపై 75 కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.గౌరీశాంతి తదితరులు పాల్గొన్నారు.

రాజానగరంలో శాకాహార ర్యాలీ

రాజానగరం: స్థానిక పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రతినిధి సంగిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 108 పిరమిడ్ శక్తి క్షేత్రాల మహాయజ్ఞంలో భాగంగా రాజానగరంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. సకల జీవుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై 'అహింస, మహాకరుణ శాకాహార సద్భావన' పేరుతో నిర్వహించిన ఈ ర్యాలీ స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయం నుంచి ప్రారంభమై గాంధీబొమ్మ సెంటర్, ఏడీబీ రోడ్డు కూడలి, జాతీయ రహదారి, సూర్యారావుపేట మీదుగా సాగింది. సాయిబాబా ఆలయం, బస్టాండ్, గాంధీ బొమ్మ సెంటర్లలో మానవహారాలుగా ఏర్పడి శాకాహార ఆవశ్యకతను వివరిస్తూ నినాదాలిచ్చారు. పిరమిడ్ సేవాదల్ ఏపీ అధ్యక్షుడు వల్లూరి శివ, కాకినాడ జిల్లా కార్యదర్శి అనిత, కోనసీమ కన్వీనర్ వి. శ్రీనివాస్, పశ్చిమ గోదావరి జిల్లా కన్వీనర్ మేకా వెంకటేశ్వరరావు, ఆయా జిల్లాల నుంచి వచ్చిన పిరమిడ్ మాస్టార్లతోపాటు రాజానగరం, రంగంపేట, గండేపల్లి, కోరుకొండ, సీతానగరం, జగ్గంపేట, పెద్దాపురం, అనపర్తి, రాజమహేంద్రవరం మున్నగు ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో వచ్చిన యోగ సాధకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం ఉన్నత పాఠశాలలో 1987-92 వరకూ చదువుకున్న పూర్వ విద్యార్థులంతా బలభద్రపురంలో మంగళవారం ఆత్మీయ కలయిక ఏర్పాటుచేసుకున్నారు. కార్యక్రమంలో చిన్ననాటి సంగతులు గుర్తుచేసుకుని రోజంతా సందడిగా గడిపారు. కార్యక్రమంలో అప్పటి తెలుగు పండితులు అమ్మనరాజా, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు రాజారత్నం, సోషల్ ఉపాధ్యాయులు మల్లిడి వెంకట కృష్ణారెడ్డిలను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ బుంగా రామారావు, మల్లిడి కనక ప్రసాద్‌రెడ్డి, మల్లిడి శిరిషా, సందక రాజేష్ తదితరులు నిర్వాహకులుగా వ్యవహరించారు.



కాపవరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద శిలాఫలకం పునరావిష్కరణ



విమానాశ్రయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు, సిబ్బంది



అనపర్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు



గోకవరంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

మహనీయుల త్యాగఫలమే స్వాతంత్య్రం

- ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి
- ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవం

రాజానగరం: ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే స్వాతంత్య్రమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలో పలుచోట్ల జాతీయ పతాకాలను ఆయన ఆవిష్కరించారు. లాలాచెరువు హెచ్‌బీ కాలనీలోని మహాత్మాగాంధీ సైకిల్ వర్తకుల సంక్షేమ సంఘం, ఆటోనగర్‌లోని టెక్నిషియన్స్ అండ్ ఇంజినీర్స్ అసోసియేషన్, దివాన్‌చెరువులోని సొసైటీ, రాజానగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద జరిగిన వేడుకలకు హాజరయ్యారు. జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మందారపు సీతారత్నం జాతీయ పతకాన్ని ఎగురవేశారు. ఎంపీడీవో బి.రామారావు, ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ పవన్‌కుమార్, పోలీసు స్టేషన్ వద్ద సీఐ కాశీవిశ్వనాథ్, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సీడీపీఓ టి.నాగమణి మువ్వన్నెల జెండాలను ఆవిష్కరించారు. గ్రామ సచివాలయాలు, పంచాయతీల వద్ద ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు జెండాను ఎగురవేశారు.

- జీఎస్ఎల్ వైద్య కళాశాలలో చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. గైట్ కళాశాల క్యాంపస్‌లో అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్ బాబు జెండాను ఎగురవేశారు. గైట్ కాలేజీ క్యాంపస్‌లోని పాలిటెక్నిక్, ఫార్మసీ, ఇంజినీరింగ్, డిగ్రీ కాలేజీల్లోనూ వేడుకలు జరిగాయి.
- దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ప్రిన్సిపాల్ ఏవీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలోనూ, తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో చైర్మన్ ఉపేంద్రరెడ్డి ఆధ్వర్యంలోనూ స్వాతంత్య్ర దినోత్సవం నిర్వహించారు.

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో 28 మంది స్వాతంత్య్ర సమరయోధులను స్మరిస్తూ శిలాఫలకాన్ని పునరావిష్కరణ చేశారు. మండల పరిషత్ అధ్యక్షురాలు ఉల్లి వీరవెంకట సత్య సూర్యకుమారి తొలుత జాతీయ జెండాను ఎగురవేసి, వందనం చేశారు. అలాగే మండలంలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా జరిగాయి. బూరుగుపూడి హైస్కూల్, పీఏసీఎస్ వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు. దోసకాయలపల్లిలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వ్యవసాయ సలహామండలి చైర్మన్ క్రొవ్విడి సత్రాజు, జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్‌తేజ, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, బొరుసు బద్రి, గొల్లపల్లి ప్రవీణ్ కుమార్, నేతుల చిన్ని, కాలచర్ల నాగు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు జాతీయ జెండాను ఎగురవేశారు.

సీతానగరం: సీతానగరం సచివాలయంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు జాతీయ జెండాను ఎగురవేశారు. పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సుజాత, పార్టీ నాయకులు వలవల వెంకట్రాజు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో కె.రమేష్, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై కె.చిరంజీవి జెండాలను ఆవిష్కరించారు. సీతానగరం మదర్ థెరిస్సా సెంటర్ వద్ద వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పెదపాటి డాక్టర్ బాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ మట్ట వసంతరావు, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీను, పార్టీ నాయకులు వలవల వెంకట్రాజు, కోన శ్రీను, వలవల వల్లి పాల్గొన్నారు. ముగ్గళ్ల ఎస్సీపేట ఎంపీపీ స్కూల్లో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, సీతానగరం పీహెచ్‌సీ వద్ద డాక్టర్ ఏవీకే చైతన్య, డాక్టర్ రాజు, డాక్టర్ మేఘన, డాక్టర్ ఏసురత్నం పాల్గొననారు., సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో హెచ్‌ఎం వీరభద్రం, ఉపాధ్యాయుడు కన్నూరి సతీష్‌బాబు, పురుషోత్తపట్నంలో వెలచేటి మెహర్‌బాబా (సిరి), శరత్, చింతలపూడి ముత్యాలరావు, రామచంద్రపురంలో జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, చల్లమళ్ల సుజీరాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.



రాజానగరం పీహెచ్‌సీ వద్ద జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు



అనపర్తి ఏరియా ఆసుపత్రి వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అమరవీరుల త్యాగ ఫలం

అనపర్తి: దేశ స్వాతంత్య్రం కోసం ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితమే మన స్వేచ్ఛాయుత జీవనమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. 77వ స్వాతంత్య్ర వేడుకలు మంగళవారం మండలంలో వాడవాడలా కనుల పండువగా జరిగాయి. మండలంలోని అనపర్తి, రామవరం జెడ్పీ ఉన్నత పాఠశాల, స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం, అనపర్తి ఏరియా ఆసుపత్రి, గ్రామ సచివాలయం, రాముడమ్మపేట, వెంకటరత్నాపురం ప్రాంతాల్లో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం, సుపరిపాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలతో అలరించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, సత్తి రామకృష్ణారెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, చిర్ల వీర్రాఘవరెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద 77వ స్వాతంత్య్ర వేడుకల్లో ఎంపీపీ కేతా తులసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కాండ్రేగుల ఉన్నత పాఠశాల, సచివాలయం వద్ద జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ సత్యనారాయణలు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ టి.సుభాష్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. జి.మామిడాడ ఆదిత్య స్కూలులో జరిగిన వేడుకల్లో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి టీఎస్ఎస్ మూర్తి, డెంటల్ సర్జన్ డి.సుస్మిత, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు.

బిక్కవోలు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కొంకుదురు ఉన్న పాఠశాల వద్ద జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ శ్రీనివాస్, బిక్కవోలు మదుగులమ్మగుడి వద్ద ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీరవెంకటసుబ్బారెడ్డి, పందలపాక ఉన్నత పాఠశాల వద్ద పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

రంగంపేట: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ రిమ్మలపూడి సత్యశ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబులు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ టి.రామకృష్ణ జాతీయజెండాను ఆవిష్కరించి పాఠశాల విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టారు.

గోకవరం మండలంలో..

గోకవరం: స్థానిక పాత బస్టాండ్ సమీపంలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి, పార్టీ నాయకులు సుంకర వీరబాబు, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, తహసీల్దార్ కార్యాలయంలో సుగుణ, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై యువి శివ నాగబాబులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

నన్నయ యూనివర్సిటీలో..

రాజానగరం: నన్నయ యూనివర్సిటీలో ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల గౌరవ వందనాన్ని స్వీకరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా యుద్ధసేవ, నేవీ సేవ మెడల్స్ గ్రహీత, కమాండర్ ఆదిమూలం చిన వెర్రియ్యను సన్మానించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు. కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ప్రధానాధికారి డాక్టర్ బీఎస్‌జీఆర్ నాయుడు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. దివాన్‌చెరువులోని బిజాపూరీ టౌన్‌షిప్‌లో నూతనంగా ఏర్పడిన వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గం ఆధ్వర్యంలోనూ పంద్రాగస్టు వేడుకలు జరిగాయి.



నన్నయ వర్సిటీలో జెండా వందనం చేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు, తదితరులు



పెదపూడి ఎంపీడీఓ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఎంపీపీ కేతా తులసి



బిక్కవోలు ఎంపీడీఓ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎంపీపీ జ్యోతిర్మయి



రంగంపేట ఎంపీపీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సత్యశ్రీదేవి



జి.మామిదాడ ఆదిత్య స్కూల్లో జెండా వందనం చేస్తున్న టీఎస్ఎన్ మూర్తి



సీతానగరం తహసీల్దార్ కార్యాలయం వద్ద వేడుకలు

ఉత్తమ సేవలకు పురస్కారాలు



రాజమహేంద్రవరంలో మంత్రి వేణు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ టి.రామగుర్రెడ్డి, రంగంపేట పీహెచ్‌సీ డాక్టర్ లావణ్య, ఊలపల్లి పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సీతానగరం ఎంపీడీవో రమేష్, ఏఈవో శ్రీనివాస్, సుబ్రహ్మణ్యేశ్వరరావు, గోకవరం ఏపీఓ అప్పలరాజు

అనపర్తి/రంగంపేట/బిక్కవోలు/పెదపూడి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి రాజమహేంద్రవరంలో జరిగిన వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, జిల్లా కలెక్టర్ మాధవీలతల చేతుల మీదుగా అందజేశారు. అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ తాడి రామగుర్రెడ్డి ఉత్తమ అవార్డు అందుకున్నారు. కొవ్వూరు డిప్యూటీ డీఎంహెచ్ఓగా సేవలందించి అనపర్తి ఏరియా ఆసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జన్‌గా బదిలీపై వచ్చిన అనపర్తికి చెందిన డాక్టర్ జి.వరలక్ష్మి, అనపర్తి అవలోకనం, భీమఖండం శైవక్షేత్ర దర్శిని సంకలనకర్త పీవీఎస్ఎస్ ప్రకాశరావులు అవార్డులు అందుకున్నారు. రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డి.లావణ్య, రంగంపేట ఎస్ఐ టి.రామకృష్ణ, రెవెన్యూ ఆర్ఐ కె.విశ్వతేజ పురస్కారాలకు ఎంపికయ్యారు. బిక్కవోలు మండలంలోని ఊలపల్లి పంచాయతీ కార్యదర్శిగా సేవలందిస్తున్న కె.రామకృష్ణ ఉత్తమ పంచాయతీ కార్యదర్శి అవార్డు అందుకున్నారు. పెదపూడి మండలానికి సంబంధించి విద్యుత్ శాఖ ఏఈ కె.రవిచంద్ర బుచ్చిరాజు కాకినాడ పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర మంత్రి సిదిరి అప్పలరాజు, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. పెదపూడి మండలం దోమాడ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎస్‌వీవీఎస్ కృష్ణారెడ్డి మంగళవారం విజయవాడలో గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం కార్యాలయం వద్ద డైరెక్టర్ లక్ష్మీషా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

సీతానగరం: మండలంలో పలువురు అధికారులకు ఉత్తమ సేవలకు గుర్తింపుగా అవార్డులను అందుకున్నారు. రాజమహేంద్రవరంలో మంత్రి వేణు చేతుల మీదుగా సీతానగరం ఎంపీడీవో కె.రమేష్, వ్యవసాయశాఖ ఏఈవో పీవీ శ్రీనివాస్, వంగలపూడికి చెందిన రాజమహేంద్రవరం వికాస ఎక్కౌంట్ సెక్షన్ అసిస్టెంట్ మేనేజర్ నలనాగ సుబ్రహ్మణ్యేశ్వరరావు అవార్డులు అందుకున్నారు.

గోకవరం: గోకవరం ఏపీఓ, కొవ్వూజుజీ ఇన్‌చార్జి ఏపీడీ పి.శేషఅప్పలరాజు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. రాజమహేంద్రవరంలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా పురస్కారం స్వీకరించారు. ఫోక్స్‌పేట అటవీశాఖ సిబ్బంది డిప్యూటీ రేంజ్ అధికారి జె.సుజాత, ఫారెస్టు సెక్షన్ అధికారి డి.అప్పారావు, ఎఫ్‌బీఓ సుభద్రాదేవి రంపచోడవరం ఫారెస్టు డివిజన్ స్థాయిలో ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం సూదికొండ అటవీశాఖ కార్యాలయంలో రేంజర్ కరుణాకర్ అవార్డు గ్రహీతలను అభినందించారు.



ఉత్తమ ఏఈగా మంత్రి అప్పలరాజు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రవిచంద్ర బుచ్చిరాజు



విజయవాడలో రాష్ట్ర ఉత్తమ పంచాయతీ కార్యదర్శి అవార్డు అందుకుంటున్న కృష్ణారెడ్డి



సూదికొండ అటవీశాఖ కార్యాలయంలో ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న సిబ్బందిని అభినందిస్తున్న రేంజర్ కరుణాకర్

వ్యక్తి ఆత్మహత్య

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం పంచాయతీ పరిధిలోని వెలమపేటకు చెందిన బండారు సుదర్శన పోశియ్య (51) మంగళవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఏఎస్సై సమర్పణరావు తెలిపారు. పోశియ్యకు షుగర్ వ్యాధి ఉండడంతో మద్యం తాగడం మానేయాలని భార్య వెంకటలక్ష్మి, కుమారుడు వెంకటేశ్వరరావు మందలించారు. దానితో మనస్తాపం చెందిన పోశియ్య ఇంటివద్ద ఉన్న పురుగుమందును ఉదయం 7.30 గంటల సమయంలో తాగేశాడు. వెంటనే అతడిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, సాయంత్రం 4 గంటలకు మృతి చెందాడు.

జగన్ పాలనలో అందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- జి.మామిడాడలో గడప గడపకూ మన ప్రభుత్వం

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. జి.మామిడాడలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ఆయా కుటుంబాలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తమ కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారంటూ ప్రజలు ఏ గడపకు వెళ్లిన ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని ప్రజలు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచి లంక మున్ని, ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కేతా సత్యశ్రీలక్ష్మి, సత్తి లక్ష్మి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, నల్లమిల్లి భూలోకరెడ్డి, పప్పు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

నగదు కాజేశారంటూ ఫిర్యాదు

రంగంపేట: పొలం అమ్ముతామని చెప్పి నమ్మించి నగదు కాజేసి మోసం చేశారంటూ ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన చెప్పిన వివరాల ప్రకారం రంగంపేట మండలం ఈలకొలను గ్రామానికి చెందిన లంక చంద్రన్న, అతని సోదరుడు లంక వీరబాబులు 2014వ సంవత్సరంలో సర్వే నంబరు 10/4, 18/2 లో ఆరు కుంచాల వ్యవసాయ భూమి అమ్ముతామని చెప్పి తమ వద్ద నుంచి రూ.8.05 లక్షలు అడ్వాన్సుగా తీసుకుని, పొలం రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని అదే గ్రామానికి చెందిన కమిడి చక్రం ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

దాడి చేశారంటూ..

రంగంపేట: తన భర్త లంక చంద్రన్న, కుమారుడు లంక రాజాశివమణికంఠలు ఇంటిలో లేనప్పుడు కొందరు తమ ఇంటిపై దాడిచేసి చంపుతామని బెదిరించారని లంక చంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన చెప్పిన వివరాల ప్రకారం మంగళవారం ఈలకొలను గ్రామానికి చెందిన కడిమి రమణ, కడిమి రామ గోవిందు, కడిమి సాయి, కడిమి ఏసు, కడిమి బుజ్జియ్య, నాగవరపు వీరబాబు, నాగవరపు సత్య, కమిడి కనకమహాలక్ష్మిలు పొలం రిజిస్ట్రేషన్ విషయమై ఇంట్లోకి చొరబడి మారణాయుధాలతో దాడి చేసి చంపుతామని బెదిరించారంటూ లంక చంద్రమ్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దివ్యాంగుల సెల్ విభాగాల అధ్యక్షులు

రాజానగరం: నియోజకవర్గంలోని మండలాల్లో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సెల్ విభాగాలకు అధ్యక్షులను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా మంగళవారం ప్రకటించారు. రాజానగరానికి దాసరి రాంబాబు (కొత్త తుంగపాడు), కోరుకొండకు పంతం లోవరాజు (గాదరాడ), సీతానగరానికి సుధ లక్ష్మణ్ (రాపాక) నియమితులయ్యారు.